క్లుప్తంగా

వీధుల నుంచి విధుల్లోకి..



సమ్మె వీడి విధుల్లో చేరుతున్నట్లు జాయినింగ్ రిపోర్టులు అందజేస్తున్న అంగన్‌వాడీలు

బొబ్బిలి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మరికొంతమంది అంగన్‌వాడీలు శనివారం విధుల్లో చేరారు. వారి డిమాండ్లలో కొన్నింటికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో మొత్తం 105 మంది విధుల్లో చేరుతున్నట్లు జాయినింగ్ రిపోర్టులు ఐసీడీఎస్ కార్యాలయానికి సమర్పిస్తున్నారు. విధుల్లో చేరిన వారిలో 53 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 52 మంది ఆయాలు ఉన్నారని ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి తెలిపారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

రాజాం: సమ్మె విరమించి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు శనివారం విధుల్లో చేరారు. రాజాం పట్టణ పరిధిలో 10 మంది, రాజాం రూరల్ పరిధిలో 15 మంది విధులకు హాజరైనట్లు ఐసీడీఎస్ పీవో పి.కనకదుర్గ తెలిపారు. వారంతా విధుల్లో చేరుతున్నట్లు విల్లింగ్ లెటర్లు అందించారన్నారు.

40 మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని ఆడవరం గ్రామంలో ఓ కిరాణా షాపులో అక్రమంగా విక్రయిస్తున్న 40 మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకున్నామని రేగిడి ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. మద్యం విక్రయాలపై అందిన ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి, మద్యంబాటిళ్లను పట్టుకుని, సంబంధిత వ్యాపారిపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

బొబ్బిలి: మండలంలోని ముత్తాయవలసలో మద్యం విక్రయిస్తున్న చింతాడ వెంకటమ్మ అనే వ్యక్తిని పోలీసులు శనివారం పట్టుకుని, అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. మద్యం విక్రయాలపై వచ్చిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది గ్రామం వెళ్లి, తనిఖీలు చేయగా, ఆమె పట్టుబడిందని, ఆమె వద్ద నుంచి 21 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముగడలోని పోలింగ్ కేంద్రం పరిస్థితిపై ఆరా తీస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్

బాడంగి: మండలంలోని కోడూరు, ముగడ, వాడాడ, పినపెంకి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ శనివారం పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నాటికి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఆర్.జయంతి, తదితరులు ఉన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఉన్న పలువురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు శనివారం పంపిణీ చేశారు. సంకిలి దగ్గరున్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం ఆర్థిక సాయంతో హెల్పేజ్ ఇండియా ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో కర్మాగారం సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామి రెడ్డి, హెచ్‌ఆర్‌డీ మేనేజర్ వి.మురళీకృష్ణ, హెచ్‌ఆర్ గణపతి, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, హెల్పేజ్ ఇండియా సిబ్బంది సీహెచ్ గణపతిరావు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నూతన సీఐ మోహనరావుకు స్వాగతం పలుకుతున్న రవికుమార్

రాజాం సిటీ: స్థానిక పట్టణ సీఐగా దాడి మోహనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఇక్కడ సీఐగా పనిచేసిన రవికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటానని, రానున్న ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కృషి చేస్తానని ఆయన అన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా

- నియోజకవర్గంలో 60,084 మందికి మూడు విడతల్లో రూ.88.11 కోట్ల రుణమాఫీ
- నాలుగో విడతలో 60,133 మందికి రూ.29.50 కోట్ల రుణం చెల్లించేందుకు రంగం సిద్ధం
- బకాయి రుణాలు ఖాతాల్లో జమ కానుండడంతో లబ్ధిదారుల్లో ఆనందం
- మొత్తం నాలుగు విడతల్లో 60,133 మందికి రూ.117.52 కోట్ల లబ్ధి



బూసాయవలసలో మహిళా సంఘ సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం నిధుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వెలుగు ఏపీఎం రత్నాకర్(ఫైల్)

రామభద్రపురం: ప్రతిపక్ష నేత హోదాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాల రుణమాఫీ చేస్తూ అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్నారు. దీనికోసం వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేసి, ఇప్పటివరకు మూడు విడతల్లో పలు సంఘాల రుణమాఫీ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయగా, ఇప్పుడు నాలుగో విడత కింద మరికొన్ని సంఘాల రుణమాఫీ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో లబ్ధిదారుల్లో ఎక్కడ లేని ఆనందం నెలకొనడం విశేషం. ఎన్నికల రోజు వరకు అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల రుణాల మొత్తం నాలుగు విడతల్లో వారి చేతికే అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగానే సీఎం జగనన్న హామీ నెరవేరుస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మండలాల వారీగా నాలుగు విడతల రుణమాఫీ(రూ.కోట్లలో) వివరాలిలా..			
మండలం	సభ్యులు	మూడు విడతల రుణమాఫీ	నాలుగో విడత మాఫీ
ఆర్.బి.పురం	10,640	రూ.15.12 కోట్లు	రూ.4.98 కోట్లు
బాడంగి	11,395	రూ.14.11 కోట్లు	రూ.4.72 కోట్లు
బొబ్బిలి రూరల్	15,373	రూ.24.07 కోట్లు	రూ.8.03 కోట్లు
బొబ్బిలి అర్బన్	9,995	రూ.16.17 కోట్లు	రూ.5.88 కోట్లు
తెర్లాం	12,701	రూ.17.55 కోట్లు	రూ.5.89 కోట్లు

నియోజకవర్గంలో 5,391 సంఘాలు..

వైఎస్సార్ ఆసరా ద్వారా బొబ్బిలి నియోజకవర్గం పరిధిలోని 60,084 మంది సభ్యుల బ్యాంకు ఖాతాల్లో మూడు విడతల్లో రూ.88.11 కోట్లు జమ చేశారు. అలాగే నాలుగో విడత కింద 60,133 మంది సభ్యులకు రూ.29.50 కోట్లు రుణ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. నియోజకవర్గంలోని 5,397 స్వయం శక్తి సంఘాల్లోని మొత్తం 60,133 మంది సభ్యులకు నాలుగు విడతల్లో మొత్తం రూ.117.52 కోట్ల రుణ బకాయిలు చెల్లించి, వారికి ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేరుస్తున్నారు.



వైఎస్సార్ ఆసరా డబ్బులతో కిరాణా షాపు పెట్టుకున్న సాయిలక్ష్మి గ్రూపు సభ్యురాలు చంద్రావతి



వైఎస్సార్ ఆసరా డబ్బులతో పండ్ల వ్యాపారం చేసుకుంటున్న మార్గదర్శి గ్రూపు సభ్యురాలు జయ

జగనన్నకు రుణపడి ఉంటాం..



జగనన్న ఇచ్చిన మాట ప్రకారం మూడు విడతల్లో మా సంఘానికి నగదు జమ అయింది. ఆ డబ్బులతో గాజుల దుకాణం పెట్టుకున్నా. ఆ షాపు ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు ఉపయోగపడుతోంది. మా కుటుంబమంతా జగనన్నకు రుణపడి ఉంటాం.

–ఇమంది స్వాతి, వైఎస్సార్ ఆసరా లబ్ధిదారు, రామభద్రపురం.

అప్పులు తీర్చుకున్నాం..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాకు అంతా మంచే జరిగింది. మేమంతా కూలి పనులు చేసుకుంటూ జీవిస్తాం. డ్వాక్రా అప్పుల ఊబిలో ఉన్న మా సంఘానికి జగనన్న ప్రభుత్వం చేయూతనిచ్చింది. నాకు మూడు విడతల్లో అందిన సొమ్ముతో పాన్‌షాపు పెట్టుకున్నాను. కుటుంబమంతా సంతోషంగా జీవిస్తున్నాం.

–చప్ప భవానీ, వైఎస్సార్ ఆసరా లబ్ధిదారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం..



మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం. అందుకే వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు వంటి పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ ఆసరాకు సంబంధించి, త్వరలో నాలుగో విడత నగదు పంపిణీకి అంతా సిద్ధం చేశాం. బొబ్బిలి నియోజకవర్గంలోని సంఘాల సభ్యులకు నాలుగో విడతలో 29.50 కోట్లు వైఎస్సార్ సీపీ సర్కారు ఇవ్వనుంది.

–బి.రవికుమార్, ఏరియా కో–ఆర్డినేటర్.

ప్రభుత్వ ఆశయానికి తూట్లు!



రామభద్రపురంలోని చొక్కాపు వీధిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

- రామభద్రపురం చొక్కాపు వీధిలో కానరాని పారిశుద్ధ్యం
- దుర్వాసనతో గ్రామస్తుల అవస్థలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రామభద్రపురం: పల్లెలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం మెరుగైన పారిశుద్ధ్య సేవలకు కృషి చేస్తుంటే కొన్నిచోట్ల అధికారులు మాత్రం సర్కారు ఆశయానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారు. స్థానిక మేజర్ పంచాయతీలోని చొక్కాపు వీధిలో చెత్తకుప్పలు విపరీతంగా పేరుకుపోయి డంపింగ్ యార్డులా తలపిస్తోంది. దీని నుంచి వెదజల్లుతున్న దుర్వాసనతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముక్కులు మూసుకుని మరీ ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఇదే విషయం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులతో పాటు మండల ఉన్నత అధికారులు కూడా పారిశుద్ధ్య సమస్యపై కన్నెత్తి కూడా చూడకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సీసీ కాలువల్లో కూడా మురుగునీరు నిల్వ ఉండిపోతోందని, దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్తకుప్పలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇన్‌చార్జ్ ఈవో సూరిబాబును సాక్షి వివరణ కోరగా, పారిశుద్ధ్య పనులు చేయిస్తామని తెలిపారు.



బొబ్బిలి: కోరాడ వీధిలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

వీధుల్లో చెత్త వేయొద్దు..

బొబ్బిలి: వీధుల్లో చెత్త వేయొద్దని, ఇంటి దగ్గరి రోజువారీ చెత్తను ప్రతిరోజూ వీధుల్లోకి వస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పట్టణంలోని తారకరామా కాలనీ, సాయినగర్ ఏరియా, పాకి వీధి, కోరాడ వీధి, బలిజిపేట రోడ్డు ప్రాంతాల్లో శనివారం పర్యటించిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సచివాలయాలకు వెళ్లి, కులగణనపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జరిగిన ఫైనల్ పోటీల్లో వివిధ గ్రామాల జట్లు పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఈ పోటీలు జరుగుతుండగా, ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు, క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



బాడంగి: మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన భీమవరం జట్టు

–సాక్షి నెట్‌వర్క్

రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు

రామభద్రపురం: మండలంలో రూ.35 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన పంచాయతీరాజ్, వివిధ ప్రాజెక్ట్ శాఖల పర్యవేక్షణలో గ్రామాల్లో ప్రగతి పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. ఇందులో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు తదితర భవన నిర్మాణాలు రూ.11.11 కోట్ల ఉపాధి హామీ నిధులతో జరుగుతుండగా, రూ.18.12 కోట్ల ఉపాధి హామీ పథకం, పీఎంజీఎస్‌వై నిధులతో సీసీరోడ్లు, బీటీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అలాగే జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎంపీ ల్యాడ్స్, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5.77 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. శాశ్వత ప్రాతిపదికన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా.. రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధి ఏమీ జరగలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ఎన్ని విమర్శలు చేసిన ప్రజలు మాత్రం నమ్మరన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లోనూ జగనన్న ప్రభుత్వానిదే మళ్లీ విజయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, మండల ఉపాధ్యక్షుడు ద్వర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయమని, దానిని కొనసాగించాలని కోరారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా చూడాలని, లింగ వివక్ష చూపరాదని సూచించారు. గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై మహిళలు, బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సహోద్యోగులు వేధింపులకు పాల్పడితే సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. స్త్రీలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి సమాజంలో, కుటుంబంలో తగినంత ఆదరణ లభించాలన్నారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయి తేజ, న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఏఎస్‌ఐ ఎ.లక్ష్మంనాయుడు, ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రేపు బైక్ ర్యాలీ

బొబ్బిలి: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన బాలరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని, స్థానిక పట్టణంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు చెలికాని కేశవ, హిందూ ఉత్సవ సమితి బొబ్బిలి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ర్యాలీకి అందరూ రావాలని, రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్, బైపాస్ రోడ్డులోని దాడితల్లి ఆలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

దుస్తుల వితరణ

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 30 మంది నిరుపేదలకు శనివారం దుస్తులు వితరణ చేశారు. సాదెం శ్రీనివాసరావు, సాదెం వెంకటరమణ, ఎస్.రాజేశ్వరిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఉన్న బాలాజీ టెంపుల్(ఆలయం) వద్ద భక్తులకు శనివారం అన్నదానం చేశారు. ప్రతీ శనివారం ఇక్కడి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

23, 24 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు

బాడంగి: విజయనగరంలో ఈ నెల 23, 24వ తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురగాల లక్ష్మణరావు మాదిగ, అధ్యక్షుడు పి.సుధాకర్ మాదిగ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా చేపడుతున్న ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, మాదిగలంతా హాజరుకావాలని కోరారు.

గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా సందడి



రాజాం: గడిముడిదాంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ సులోచన




రేగిడి: కందిశలో ఒకచోట సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిపై ఎంపీపీ లావేటి సులోచన శనివారం ప్రచారం నిర్వహించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత డబ్బులు జమ కానున్నాయని, సీఎం జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మొత్తం నాలుగు విడతల్లో సంఘాల రుణమాఫీ సొమ్ము వేస్తున్నారని తెలిపారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని కందిశ, తునివాడ, వావిలవలస గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత డబ్బుల పంపిణీపై గ్రామసభలు నిర్వహించి మరీ మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న నగదును సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం గోవిందరావు ఆకాంక్షించారు.

బాడంగి: రానున్న రెండు, మూడు రోజుల్లో వైఎస్సార్ ఆసరా నగదు జమ కానుండడంతో మహిళా సంఘాల సభ్యులు సంబరాలు చేసుకుంటున్నారు. ఏ సంఘానికి ఎంతమేర నగదు వస్తుంది.. దానిని ఏం చేయాలన్న దానిపై చర్చించుకుంటున్నారు.

22న బాలరాముని శోభాయాత్ర



శోభాయాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రంగనాథం

రాజాం: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని, స్థానిక పట్టణంలోని శాణావీధి విష్ణుకోవెల నుంచి అమ్మవారి ఆలయ సమీపంలోని కోదండరామ ఆలయం వరకు బాలరాముని శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు పనసవలస వైష్ణవ ఆచార్య పీఠాధిపతి రంగనాథం శనివారం తెలిపారు. అంతకుముందు స్థానిక కోదండరాముని ఆలయం వద్ద యాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ యాత్రలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, ఉమాపతి శేషు గురుస్వామి, కొవ్వాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● పారదర్శకంగా కులగణన



రామభద్రపురం: సంతతోటలో కులగణన సర్వేలో ఎంపీడీవో రమామణి



తెర్లాం: నందిగాంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ



వంగరలో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు శనివారం ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ ప్రక్రియ జరగనుంది. నిర్దేశిత గడువులోగా కులగణనను పారదర్శకంగా చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు. –సాక్షి నెట్‌వర్క్



రాజాం: పాగిరిలో కులగణన సర్వే చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ



రాజాం సిటీ: రాజాంలో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు